క్లుప్తంగా

యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే దొంతి పూజలు



నర్సంపేట : యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మి నరసింహస్వామిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ టీటీడీ తరహాలో వైటీడీ ఏర్పాటు చేయడం ద్వారా దేవాలయ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలంతా యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోవాలని, రాబోయే రోజుల్లో దేశ ప్రజలను ఆకర్షించేలా ఆలయం ఉంటుందన్నారు. ఆ దిశగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

సన్మానం



నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన అన్న బీరేంద్ర హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా, యోగేశ్వర్ నర్సింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగాలు సాధించగా వారిని వారి మిత్రులు శుక్రవారం శాలువాతో సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్, విజయ్, రమేశ్, సంతోశ్, స్నేహితులు ప్రవీణ్, పల్లకొండ తిరుపతి, పులిశేరు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. హెచ్‌ఎంగా రాళ్లబండి స్నేహిత, ఉపాధ్యాయులుగా సహస్ర, అక్షయ, పోగుల తరుణ్‌తేజ్, సాత్విక్, సంతోశ్, కందుకూరి సంతోశ్ వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్‌ఎం పరుపాటి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మంచాల రమేశ్, వేద ప్రకాశ్, ఓంప్రకాశ్, సంధ్య, కొమురయ్య అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన కోయల అభిరామ్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అతడి తండ్రి వీరన్నకు స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడారు. అభిరామ్ గతంలో అనారోగ్యం బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోగా సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.37,550 సాయం మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, ఉపాధ్యక్షుడు మాలోత్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

దుగ్గొండి : మండల కేంద్రంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోగా యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన గోర్కటి సందీప్ మరో యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై మల్లంపల్లిలోని పదో తరగతి పరీక్షా కేంద్రానికి వారి మిత్రుడిని కలవడానికి వస్తుండగా మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సందీప్‌ను ఎంజీఎంకు తరలించారు.

భూమి కేటాయించండి

సంగెం : సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ, గిరిజన కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు ఎకరం భూమి కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్‌కు మాజీ జెడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. సేవాలాల్‌ను పూజించేందుకు, ఉత్సవాల నిర్వహణకు భూమి అవసరం ఉందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : చెన్నారావుపేట, ఉప్పరపల్లి విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తిరుపతి, చెన్నారావుపేట ఏఈ జోగానంద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెద్దకాల్వలో చేరుతున్న డ్రెయినేజీ నీరు

- రైతులు, వ్యవసాయ కూలీలకు తిప్పలు
- సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం

నర్సంపేట రూరల్ : వ్యవసాయ భూములకు నీరందించే కాల్వలోకి డ్రెయినేజీ నుంచి మురుగు చేరుతుండడంతో నీరు కలుషితమై పంటలు దెబ్బతింటున్నాయి. అలాగే ఆ భూముల్లోకి వ్యవసాయ పనులకు వచ్చే కూలీలతోపాటు రైతులు దురద, తదితర చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. మాదనపేట కాల్వ కిందున్న భూముల్లో పనులకు వెళ్లాలంటే కూలీలు జంకుతున్న దుస్థితి నెలకొంది. సమస్యను వివరించినా ఐబీ, మున్సిపల్ అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవని రైతులు వాపోతున్నారు.

నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువు కింద అధికారిక గణాంకాల ప్రకారం సుమారు 3 వేల ఎకరాలు, అనధికారిక లెక్కల మేరకు మరో 500 ఎకరాల ఆయకట్టు ఉంటుంది. చెరువుకు 3 ప్రధాన కాల్వలున్నాయి. దుబ్బకాల్వ నీరు నాగుర్లపల్లి శివారులోని వ్యవసాయ భూములకు పారుతోంది. మిట్టకాల్వ కింద నర్సంపేటలోని కమలాపురం శివారులోని పంట పొలాలకు పారకం సాగుతుండగా పెద్ద కాల్వ దాదాపు 5–6 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. పారకంలో నర్సంపేట నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర కాల్వ నీరు ప్రవహిస్తాయి. గతంలో కాల్వ కింద వ్యవసాయ భూములుండగా నర్సంపేట జనావాసాలతో నిండిపోతున్న క్రమంలో కాల్వలో మధ్యలోకి చేరింది. దాదాపు 2 కిలోమీటర్ల మేరకు జనావాసాల మధ్య నుంచి సాగునీరు పారుతుండడంతో ఆవైపు ఉన్న డ్రైనేజీ నుంచి వస్తున్న మురుగు కాల్వలో చేరుతుండడంతో నీరు కలుషితమవుతోంది. అంగడి సెంటర్‌లో పెద్ద కాల్వ పక్కనే కమ్మేళా ఉండడంతో జంతువులను వధించిన తర్వాత వ్యర్థాలను కాల్వలో పడేస్తున్న పరిస్థితి నెలకొంది. గతంలో ఈ కాల్వకు పలువురు రైతులు పశువుల దాహం తీర్చేందుకు తీసుకు రావడం ఆనవాయితీగా ఉండేది. ప్రస్తుతం మురుగు కలవడం, పశువుల వ్యర్థాలను వేస్తుండడంతో నీరు పశువులు దాహం తీర్చుకునేందుకు సైతం పనికిరాకుండా పోయాయి. అయితే నీళ్లు వ్యవసాయ భూములకు పారుతుండడంతో పంటల దిగుబడి తగ్గిపోతోంది. అంతేకాకుండా రైతులు నీల్లు పారించాలన్న ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వ్యవసాయ కూలీలు పనులకు రావడానికి జంకుతున్నారు. పనులు చేసిన రైతులు, కూలీలు చర్మ వ్యాధుల బారిన పడుతున్నారు. డ్రైనేజీ నీరు పంట కాల్వలో చేరకుండా చూడాలని కోరుతూ నర్సంపేట ఐబీ శాఖ, మున్సిపల్ అధికారులకు పలుమార్లు వినతిప్రతాలు అందించినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు బహిరంగంగానే మండిపడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని రైతులు, కూలీలు కోరుతున్నారు.



పెద్దకాల్వలో చేరుతున్న మురుగు నీరు

గతంలోనే రూ.4 కోట్లు మంజూరు

మాధన్నపేట పెద్ద కాల్వలో నర్సంపేటలోని డ్రైనేజీ నీరు కలుస్తుండగా రైతులు, వ్యవసాయ ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. గత ప్రభుత్వం ప్రత్యేక డ్రెయినేజీ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేసినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. పంట కాలాల్లో కాల్వల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారంతోపాటు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు లిఖిత పూర్వకంగా నివేదిస్తున్నాం. శాశ్వత ప్రాతిపదికన డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

\- నితిన్, ఏఈ, ఐబీ శాఖ

ప్రత్యేక డ్రెయినేజీ నిర్మాణం ఎప్పుడో..?

సమస్యను పరిష్కరించేలా పట్టణంలో ప్రత్యేక డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. సమస్యను రైతులు, కూలీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాల్లేవు. ప్రత్యేక డ్రెయినేజీ నిర్మాణం చేపడితే మురుగు నీరు మాధన్నపేట చెరువులో కలిసే అవకాశం ఉండదు. రైతులు, కూలీలు చర్మ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉండదు. పంటల ఉత్పత్తి సైతం పెరుగుతుంది. గత ప్రభుత్వం ప్రత్యేక డ్రెయినేజీని నిర్మిస్తామని హామీ ఇచ్చినా ఆ దిశగా చేసిందేమీ లేదు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక డ్రైనేజీ నిర్మించి మాధన్నపేట పెద్దకాల్వలో మురుగు నీరు కలువకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అడవుల సంరక్షణ సామాజిక బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న డీఆర్‌ఓ, విద్యార్థులు, తదితరులు

- డీఆర్‌ఓ రీనా

ఖానాపురం : అడవుల సంరక్షణను సామాజిక బాధ్యతగా డీఆర్‌ఓ రీనా అభివర్ణించారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పాకాలలో సైనిక్ స్కూల్ విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన ర్యాలీకి ఆమె హాజరై మాట్లాడారు. అడవులతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. అడవుల శాతం తగ్గిపోతే మానవాళి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ అడవుల సంరక్షణను బాధ్యతగా భావించాలని సూచించారు. అడవుల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. అడవుల రక్షణకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అటవీ హక్కుల రక్షణ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. విద్యార్థి దశలోనే అడవుల పరిరక్షణపై అవగాహన పెంచేలా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్, సైనిక్ స్కూల్ పీఈటీ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మత సామరస్యానికి ప్రతీక



నెక్కొండ : ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

- సీఐ శ్రీనివాస్

నెక్కొండ : ముస్లిముల పర్వదినం రంజాన్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని స్థానిక సీఐ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మసీద్‌లో శుక్రవారం సాయంత్రం పోలీసులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. రంజాన్ మాసంలో ముస్లిము సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, మసీద్ కమిటీ ప్రతినిధులు షేక్ షబ్బీర్, యాకూబ్ పాషా, అన్వర్‌పాషా, ఇబ్రహీంఖాన్, షఫీక్, అమీర్, రఫీక్, అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

మచ్చాపూర్‌లో..

గీసుకొండ : మండంలోని మచ్చాపూర్‌లో స్థానిక స్కూల్ 2001–02 బ్యాంచ్ పదో తరగతి విద్యార్థులు వేల్పుల సురేశ్ ఆధ్వర్యంలో ముస్లిము సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇమామ్ ముజీబ్, అశ్రఫ్, మహమూద్ పాషా, రఫీ, అరసం అనిల్, గటికె నాగరాజు, మద్రి కుమారస్వామి, దేవులపెల్లి రఘునాథ్, పాలడుగుల రాజు, గోనె రాజు, రమేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ : మచ్చాపూర్‌లో..

నీటి ఎద్దడిని నివారించాలి



ఖానాపురం : వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన అధికారులను ఆదేశించారు. ఖానాపురం, రాగంపేట, రంగాపురం గ్రామాల్లో నీటిఎద్దడి నివారణపై శుక్రవారం ఆమె సమీక్షించారు. పారిశుద్ధ్య పనులు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో బావులను అద్దెకు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందన్నారు. వచ్చే వానాకాలం నాటికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని చెప్పారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు సుప్రజ, అబేద తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన బోళ్ల రామయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన బోళ్ల వంశీయులు శుక్రవారం రూ.10 వేల నగదుతోపాటు 50 కేజీల బియ్యం సాయం చేశారు. రామయ్యకు కుమారులు లేరు. కార్యక్రమంలో బోళ్ల కొమురయ్య, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు గుణపాఠం తప్పదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ పార్టీ నల్లబెల్లి మండల అధ్యక్షుడు తడక వినయ్ ఆధ్వర్యంలో దస్తగిరిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ వార్డు సభ్యుడు గుంపుల రాజు, పార్టీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగరబోయిన సాగర్, ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు జక్కుల నర్సింహరాములు, నల్లబెల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎద్దు నరేశ్ పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం బీజేపీలో చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చాయని చెప్పారు. ఆ రెండు పార్టీలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నాయకులు ఊటుకూరి చిరంజీవి, బత్తిని కుమారస్వామి, కక్కెర్ల సమ్మయ్య, మురికి మనోహర్, దొమ్మటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

ఉప్పరపల్లి క్రాస్‌లో మూడు లారీలు ఢీ

- ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- తనిఖీలతో పోలీసుల ఓవరాక్షన్ చేశారని ఆరోపణలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

వర్ధన్నపేట : వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై చందర్ కథనం ప్రకారం.. ఘటన జరిగిన స్థలానికి 100 మీటర్ల దూరంలోని చెక్‌పోస్టులో తామున్నామని, ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి వెళ్లి జేసీబీల సాయంతో లారీలను విడగొట్టి గాయపడిన ఇద్దరు డ్రైవర్లను ఎంజీఎం ఆస్పత్రికి తరలించామని తెలిపారు. డ్రైవర్ రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందర్ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి పోలీసుల అత్యుత్సాహమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణా అరికట్టే దిశగా ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై చందర్ నేతృత్వంలో పోలీసులు కాపు కాశారు. ఆ సమయంలో తనిఖీల పేరుతో పోలీసులు ఒక్కసారిగా లారీలకు అడ్డు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. పోలీసులను చూసిన ఓ లారీ డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో ఆ లారీ వెనుక వస్తున్న మరో రెండు లారీలు ఒకదానిని మరొకటిగా మూడు లారీలు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు లారీ డ్రైవర్లు తీవ్ర గాయాల పాలయ్యారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ అమ్జద్ పాషాను ప్రథమ చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'ఏంటి సార్ ఇంత అధ్వానంగా చేస్తారా' అంటూ ఆ వీడియోలో ఒక వ్యక్తి ఎస్సై చందర్‌తో మాట్లాడినట్లు వినిపిస్తోంది. ఈ విషయమై ఎస్సై చందర్‌ను వివరణ కోరగా కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. అందులో వాస్తవం లేదు. గోల్డెన్ అవర్‌లోనే తాము డ్రైవర్లను ఆస్పత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడగలిగామని పేర్కొన్నారు.



దెబ్బతిన్న లారీ ముందుభాగం

టెన్త్ పరీక్షలు ప్రారంభం



సంగెం : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పలు చోట్ల విద్యార్థులు పరీక్ష సమయానికి అర గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవడం కనిపించింది. మొదటి రోజు కావడంతో విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విషెస్ తెలిపి పరీక్ష కేంద్రాల్లోకి పంపించారు. అధికారులు అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీటి, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ఇతర మౌలిక వసతులు కల్పించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీసులు 163 సెక్షన్ అమలు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. పోలీసు, విద్యాశాఖల ఉన్నతాధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పర్వతగిరిలో..



దుగ్గొండి : బందోబస్తు పర్యవేక్షిస్తున్న సీఐ



నర్సంపేట : చెన్నారావుపేట జెడ్పీ స్కూల్‌లో..



రాయపర్తిలో..

పరామర్శ

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి తొగరు విజయ్‌పాల్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు కొండవీటి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పరామర్శించారు. తొలుత విజయ్‌పాల్‌రెడ్డి చిత్రపటానికి ప్రదీప్‌కుమార్, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు రెడ్డిమాసి కిశోర్, మంద చిన్ను, గుగులోతు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

విజయ్‌పాల్‌రెడ్డి కుటుంబానికి గణపతి యూత్ అధ్యక్షుడు ఇండ్ల సునీల్ ఆధ్వర్యంలో రూ.20 వేల సాయం అందజేశారు. అనంతరం సునీల్ మాట్లాడారు. గణపతి యూత్ బీమా నిధి నుంచి సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ ఉపాధ్యక్షుడు తండ రమేశ్, కార్యదర్శి వంగపండ్ల చిన్నరాజు, సభ్యులు భీముడు, సందీప్‌రెడ్డి, బెల్లి అశోక్, జంపాల భాస్కర్, మంచాల భరత్, చీకటి రాజశేఖర్, నూనె రమేశ్, పాలిశెట్టి సతీశ్, పులిచేరు రవీందర్, పిల్లల వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానలో వసతులు కరువు

- షెల్ఫ్‌ల నిర్మాణం లేకుండా ఎస్టిమేషన్
- సిబ్బందికి, రోగులకు ఇబ్బందులు

సంగెం : మండలంలోని మొండ్రాయి గ్రామంలోని పల్లె దవాఖానా (ఆరోగ్య ఉపకేంద్రం)లో వసతులు కరువయ్యాయి. ఆస్పత్రి భవనంలో మందులు, సామగ్రి ఉంచేందుకు అవసరమైన షెల్ఫ్‌ల నిర్మాణాన్ని పొందుపర్చకుండానే ఎస్టిమేషన్ వేసిన దుస్థితి నెలకొంది. మౌలిక వసతులు కల్పించకుండా భవనాన్ని అసంపూర్తిగా (ప్రహరీ సైతం లేకుండా) నిర్మించి వదిలేశారు.

మండలంలోని మొండ్రాయిలో నాటి ప్రభుత్వం 2018–20 బడ్జెట్ నుంచి రూ.16 లక్షలు మంజూరు చేయగా పల్లె దవాఖానా నిర్మాణం జరిగింది. భవనంలోని గదుల్లో సూదులు, మందులు ఉంచడానికి షెల్ఫ్‌లు, ఇతరత్రా సదుపాయాలు కల్పించకుండానే నిర్మాణం పూర్తి చేశారు. ఈ క్రమంలో మందులు, సామగ్రి అస్తవ్యస్తంగా నేలపైనే పడేస్తున్న దుస్థితి నెలకొంది. భవనంపైన పోర్టికో కూడా నిర్మించకపోవడంతో వర్షం కురిస్తే నీరు గదిలోకే చేరుతున్న దుస్థితి నెలకొంది. వృద్ధులు, దివ్యాంగులు వెళ్లడానికి ర్యాంపు, రెయిలింగ్ సైతం ఏర్పాటు చేయలేదు. ఆస్పత్రికి ప్రహరీ నిర్మించకపోవడంతో పలువురు వాహనాలను ఇష్టారీతిన నిలుపుతుండడమే కాకుండా సాయంత్రం, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు కూర్చోవడానికి బెంచీలు సైతం ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో ఉద్యోగులు, రోగులు ఇబ్బంది పడుతున్నారు.



ప్రహరీ లేకుండా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం



అస్తవ్యస్తంగా పడేసిన మందులు, సామగ్రి

ఆస్పత్రి వాతావరణమే లేదు

పల్లె దవాఖానాలో ఆస్పత్రి వాతావరణమే లేదు. గదులు గందరగోళంగా ఉన్నాయి. ఆస్పత్రికి వెళ్లిన భావన కూడా కలగడం లేదు. ప్రహరీ లేకపోవడంతో వాహనాలు నిలుపడానికి, ఇతరత్రా అవసరాలకు వినియోగించుకుంటున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. ఆస్పత్రికి మందులు, సూదులు ఉంచేలా ర్యాక్స్ ఏర్పాటు చేయాలి. అన్ని వసతులూ కల్పించాలి. వెంటనే ప్రహరీ నిర్మించడంతోపాటు ఇతర సదుపాయాలు కల్పించాలి.

\- పెండ్లి రమేశ్, గ్రామస్తుడు

నిబంధనల మేరకే నిర్మాణం

ప్రభుత్వ నిబంధనల మేరకే పల్లె దవాఖానా నిర్మాణం జరిగింది. 2018–20 ఆర్థిక సంవత్సరాల్లో నాటి ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసింది. బడ్జెట్‌కు అనుగుణంగా ఆస్పతి భవనం, లోపల గదుల నిర్మాణం చేయించాం. గదుల్లో షెల్ఫ్‌ల నిర్మాణం ముందుగా ప్రభుత్వానికి సమర్పించిన (ఎస్టిమేషన్) అంచనాలోనూ లేదు. మందులు, ఇతరత్రా పరికరాలు ఉంచడానికి ర్యాకులు, రోగులు కూర్చోవడానికి అవసరమైన మేరకు బెంచీలు, ఇతర ఫర్నీచర్ ఏర్పాటు చేసుకోవాలి.

\- కె.నరేశ్, ఏఈ

వేతనాలు అందక ఇబ్బందులు



ఖానాపురం : ఎస్‌టీఓలో 9 నెలలుగా వేతనాలు జమ కాకపోవడంతో పంచాయతీ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఉస్మాన్ పాషా తెలిపారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా అమలు చేయడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. వేతన బకాయిలు విడుదల చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, వెంకటమ్మ, భిక్షపతి, విజయ్‌కుమార్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.